క్లుప్తంగా

పశుగ్రాసం అందజేత



దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానం గోశాలకు సోమవారం దేవరకద్రకు చెందిన గవిని రాజు రెండు ట్రాక్టర్ల గడ్డిని అందజేశారు. గోశాలలోని గోవుల ఆకలి తీర్చేందుకు గాను తన వంతుగా దేవస్థానం పూజారి నాగరాజుస్వామి సమక్షంలో పశుగ్రాసం అందించినట్లు తెలిపారు. అదే విధంగా దేవరకద్రకు చెందిన శివకుమార్, ఉమామహేశ్వరి దంపతులు ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈఎల్‌సీ ఇవ్వాలని వినతి

మిడ్జిల్: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ఈఎల్‌సీ ప్రొసీడింగ్స్ జారీ చేసి.. ఎస్‌ఆర్‌లో నమోదు చేయాలని కోరుతూ సోమవారం మండల టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ వెంకటయ్యకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, మండల అధ్యక్షుడు వెంకటయ్య, రమేశ్, కృష్ణ, మల్లయ్య, రాజేందర్, రత్నశేఖర్, తారాసింగ్ పాల్గొన్నారు.

తాగునీరు రాక అవస్థలు



చిన్నచింతకుంట: కురుమూర్తి గ్రామంలోని 9, 10 వార్డుల్లో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు. సోమవారం ఖాళీ బిందెలతో గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జుల రాము మాట్లాడుతూ.. గ్రామంలోని 9, 10 వార్డులకు మిషన్ భగీరథ తాగునీటిని అందించే పైప్‌లైన్ రెండునెలల క్రితం పగిలిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించి తాగునీటి సమస్య తీర్చాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి

అడ్డాకుల: వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్ పిలుపునిచ్చారు. మూసాపేట మండలం జానంపేటలో సోమవారం జరిగిన మండల స్థాయి సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27న అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేసి సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, కొండయ్య, చంద్రశేఖర్, మదీనా జమీర్, రవీందర్‌గౌడ్, బోయరాజు, శరత్‌గౌడ్, చంద్రయ్యగౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్‌లో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌వీఎం సమావేశ మందిరంలో విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాలస్థాయి విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులు ఎంతో కీలకమన్నారు. వాటిపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫసియొద్దీన్, ఆంజనేయులు, ఎండీ షంషీర్, నాగరాజు, సత్యం, కృష్ణయ్య శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని చెరువులు, కుంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల అభ్యున్నతి కోసం చెరువులు, కుంటలను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పీసీఎస్ సంఘాల రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. డీఎఫ్‌సీఎస్, ఎఫ్‌సీఎస్‌లకు నిర్ణీత కాలంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మహబూబ్‌నగర్ మండలం చౌదర్‌పల్లిలోని కుంటలు రెవెన్యూ రికార్డులో ఇంకా ధర్మాపూర్ అని ఉండటంతో.. రెండు గ్రామాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందని, వెంటనే రికార్డులను సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు గంగాధర్, నర్సింహులు, కృష్ణ ముదిరాజ్ పాల్గొన్నారు.

అకాలవర్షం.. అన్నదాత ఆగం



మహమ్మదాబాద్ మండలం వెంకట్‌రెడ్డిపల్లిలో వర్షానికి తడిసిన వరిధాన్యం

- భారీ వర్షానికి తడిసి ముద్దయిన వరిధాన్యం
- ఈదురు గాలులకు నేలరాలిన మామిడి కాయలు
- నేలకొరిగిన వరిపైరు
- లబోదిబోమంటున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



గండేడ్ మండలం జిన్నారంలో..

మహమ్మదాబాద్/గండేడ్: అకాల వర్షాలతో అన్నదాత ఆగమాగమవుతున్నాడు. వ్యయప్రయాసాలకోర్చి పండించిన పంట రైతుల కళ్లెదుటే నీటిపాలై తీరని వ్యథకు గురిచేస్తోంది. సోమవారం సాయంత్రం మహమ్మదాబాద్ మండల కేంద్రంతో పాటు ధర్మాపూర్, వెంకట్‌రెడ్డిపల్లి, కంచన్‌పల్లి తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. వర్షపునీటిలో ధాన్యం కొట్టుకుపోకుండా రైతులు నానా తంటాలు పడ్డారు. వెంకట్‌రెడ్డిపల్లి, మహమ్మదాబాద్ కొనుగోలు కేంద్రాల్లో దాదాపు 3వేల బస్తాల వరకు ధాన్యం తడిసి ముద్దయ్యింది. వారం రోజులుగా వరిధాన్యం ఆరబెట్టి.. విక్రయానికి సిద్ధంగా ఉంచినా అధికారులు కొనుగోలు చేయకపోవడంతో ఇలాంటి పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు వడగండ్ల వర్షానికి వరిపైరు నేలకొరగడంతో పాటు గింజలు రాలిపోయాయి. అకాల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

■ మహమ్మదాబాద్, ధర్మాపూర్, కంచన్‌పల్లి, వెంకట్‌రెడ్డిపల్లి గ్రామాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. తోటల్లో కాయలు తెంచడానికి పూర్తి సమయం కాకపోవడంతో చెట్లకు కాయలు నిండుగా ఉన్నాయి. ఈ క్రమంలో కురిసిన వడగండ్ల వర్షానికి మామిడి కాయలన్నీ నేలరాలాయి. తోటలను కౌలుకు తీసుకున్న వారికి రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని బోరుమంటున్నారు.

■ గండేడ్ మండలంలోని జిన్నారం, వెన్నాచేడ్, జక్లపల్లి తదితర గ్రామాల్లో మోస్తారు వర్షం కురవడంతో రైతులు ఆరబెట్టుకున్న వరిధాన్యం తడిసిపోయింది. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరగా తూకం వేయక పోవడంతో నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు.

ధాన్యం కొట్టుకుపోయింది..



ఎంతో శ్రమించి పండించిన వరిధాన్యం అమ్ముకునే సమయంలో అకాల వర్షానికి తడిసిపోవడమే కాకుండా వర్షపునీటిలో కొట్టుకుపోయింది. నేను 200 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ఏడురోజులు అవుతుంది. తూకం వేయకుండా ఆలస్యం చేయడంతో అకాల వర్షానికి నష్టం వాటిల్లింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

– కొడి రఘు, రైతు, వెంకట్‌రెడ్డిపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి..



రెండెకరాల్లో మామిడితోట సాగు చేస్తున్నా. ఈ సంవత్సరం మంచి కాపు వచ్చింది. కాయలు పలికిన తర్వాత తెంచి అమ్ముకుందామని అనుకున్నాం. కానీ ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షంతో మామిడి కాయలన్నీ నేలరాలిపోయాయి. చెంచులమైన మేము ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో తోటలు పెట్టుకుంటే అకాల వర్షం వల్ల రూ.వేలల్లో నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– చెంచు సందీప్, మామిడి రైతు, ధర్మాపూర్

సమతుల్య ఆహారం తీసుకోవాలి



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా

మహబూబ్‌నగర్ రూరల్: సమతుల్య ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక వీరన్నపేట సెక్టార్‌లోని వివేకానంద కమ్యూనిటీహాల్‌లో పోషకాహారం, బాలల హక్కులు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ.. చిన్నారులకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించడంతో పాటు పోషకాలు కలిగిన ఆహారం అందించాలని సూచించారు. పిల్లల మానసిక శక్తి అభివృద్ధికి అవసరమైన కార్యాచరణపై దృష్టి పెట్టాలన్నారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అలివేలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

■ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా అన్నారు. జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం–3లో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. అతి తీవ్రలోపం ఉన్న పిల్లలను గుర్తించి.. వారికి పోషకాహారం అందించే విధంగా చూడాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, మునగకాయలు, పల్లీలు, బెల్లం, నువ్వులు, ఎండు ఖర్జూరా మొదలైన ఆహారంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీజే బెనహర్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన



మాట్లాడుతున్న నయీం కౌసర్ రషాదీ

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సభ కన్వీనర్ మౌలానా నయీం కౌసర్ రషాదీ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టంతో దేశంలోని ముస్లింలు ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా ర్యాలీలు, సభలతో తమ నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. 26న రాత్రి 7 గంటలకు నిర్వహించే బహిరంగ సభకు ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖాలెద్ సైఫుల్లా, కోల్‌కత్తాకు చెందిన మౌలానా అబుతాలిబ్ రహిమాని, హమీద్ మహ్మద్‌ఖాన్, మౌలానా ఒసాముద్దీన్ తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ కోరారు. సమావేశంలో ముస్లిం సంఘాల ప్రతినిధులు మౌలానా ఫక్రుద్దీన్ రషాది, అజహరుద్దీన్ ముక్రం, అబ్దుల్‌హకీం, నూరుద్దీన్ రషాది, జహీరుల్లాఖాన్, తఖీహుస్సేన్, సాదుల్లా, సిరాజ్‌ఖాద్రీ, అబ్దుల్ అజీజ్, ఎంఏ మజీద్, షేక్ సిరాజుద్దీన్, మహ్మద్ అబ్దుల్ నయీం, అబ్దుల్ మక్సూద్, సాధిక్ హుస్సేన్ ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలో అడిషనల్ డీఆర్డీఓ ముసాయిదా బేగానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లను ఎఫ్‌టీఈలుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా రూ. 37వేల వేతనం అమలు చేయాలన్నారు. జాబితా–3లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ నాయక్ పాల్గొన్నారు.

మసీదు నిధుల్లో గోల్‌మాల్

దేవరకద్ర రూరల్: మండల కేంద్రంలోని జామియా మసీదు లెక్కలను నిర్వాహకులైన మసీదు అధ్యక్షుడు అంజాద్ అలీ, కోశాధికారి ఫారూక్ అలీ తప్పుల తడకగా చూపిస్తున్నారని పలువురు ఆరోపించారు. సోమవారం శ్రీనివాస గార్డెన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మసీద్ దుకాణ సముదాయం నుంచి అద్దె రూపంలో పదేళ్లకు రూ. 89లక్షలు రావాల్సి ఉండగా.. కేవలం రూ. 22లక్షల మాత్రమే లెక్కల్లో చూపిస్తున్నారని అన్నారు. అద్దె డబ్బులను పక్కదారి పట్టించారని.. ఎవరైనా నిలదీస్తే దాడులకు దిగుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా మత పెద్దలు స్పందించి డబ్బుల లెక్క తేల్చాలని కోరారు. సమావేశంలో మైనార్టీ నాయకులు పాషా, హస్నొద్దీన్, ఇమ్రాన్, ఇక్బాల్, సిరాజ్, ఫయాజ్, రియాజ్, జమాల్ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిన్నచింతకుంట: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. అమ్మాపూర్‌కు చెందిన బోయ ఆంజనేయులు (38) ఈ నెల 18న గ్రామ సమీపంలోని పెద్ద చిన్నతిప్ప క్వారీ వద్ద ట్రాక్టర్‌కు రాయి వేసేందుకు కూలీ పనులకు వెళ్లాడు. అతడు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. అయినప్పటికీ ఆచూకీ లభించ లేదు. సోమవరం పెద్ద చిన్నతిప్ప వద్ద గ్రామస్తులకు అతడు శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మాలవి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అతడి మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తంచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. సీఐ కమలాకర్ కథనం మేరకు.. మండలంలోని మాచారం గ్రామానికి చెందిన పానుగంటి అనంత (40) ఈ నెల 13న జడ్చర్ల నుంచి స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా.. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గుర్తుతెలియని కారు ఆటోను వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో అనంతకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'వాటర్‌షెడ్'తో భూగర్భజలాలు పెంపు



మాట్లాడుతున్న డీఆర్డీఓ నర్సింహులు

హన్వాడ: వాటర్‌షెడ్ నిర్మాణాలతో భూగర్భజలాలు పెరుగుతాయని డీఆర్డీఓ నర్సింహులు అన్నారు. సోమవారం హన్వాడ మండలం మునిమోక్షం శివారులోని జీడిబండ ప్రాంతంలో వాటర్‌షెడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ మాట్లాడుతూ.. వాటర్‌షెడ్ కార్యక్రమంలో చెక్‌డ్యాంలు, చెక్‌వాల్వుల నిర్మాణంతో భూగర్భజలాలు మరింత పెరుగుతాయని అన్నారు. భూగర్భజలాల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అంతకుముందు గ్రామ శివారులోని సబ్‌స్టేషన్ నుంచి ప్రాథమిక పాఠశాల వరకు గ్రామస్తులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోద, ఏపీఓ హేమలత, ఏపీఎం సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ వెంకటయ్య, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు నవనీత, మాజీ సర్పంచులు రాములమ్మ, చెన్నయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



గురుకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

హన్వాడ/నవాబుపేట: ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ జనరల్ సెక్రెటరీ టంకర కృష్ణయ్య యాదవ్ సూచించారు. సోమవారం మండలంలోని కొనగట్టుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ, సబ్సిడీపై యంత్రాలు తదితర పథకాలను అందించి అండగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కృష్ణయ్య, నాయకులు బైకని వెంకటేశ్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

■ నవాబుపేట మండలంలోని ఇప్పటూర్, చౌడూర్, కొల్లూర్, గురుకుంట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దుశ్యంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాసంగిలో పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తులసీరాం నాయక్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ భూపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, నీలకంఠం, వాసుయాదవ్, వెంకటేశ్, రాజశేఖర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసలు సూత్రధారులు ఎవరు?

- ప్రశాంత్‌రెడ్డి హత్య కుట్రపై కొనసాగుతున్న విచారణ

మహబూబ్‌నగర్ క్రైం: దేవరకద్రకు చెందిన బీజేపీ నేత ప్రశాంత్‌రెడ్డి హత్యకు జరిగిన కుట్ర వ్యవహారంలో అసలు సూత్రధారులు ఎవరనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. ప్రశాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దేవరకద్ర పోలీస్‌స్టేషన్‌లో 61 క్లాజ్ 109 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ వెంకటేశ్వర్లు 'సాక్షి'కి వెల్లడించారు. ఇటీవల ప్రశాంత్‌రెడ్డి ఎస్పీని కలిసి తనకు ప్రాణహాని ఉందని.. తనను హత్య చేయడానికి కొంత మంది కుట్ర చేస్తున్నారని రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు భూత్పూర్ సీఐ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలతో సమగ్ర విచారణ చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా ఈ వ్యవహారంలో కీలకంగా మారిన కాల్ రికార్డింగ్, ఇతర అంశాలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ప్రశాంత్‌రెడ్డిని హత్య చేయాలని దాదాపు రూ. 2.50కోట్లకు సుపారీ వచ్చినట్లు ఓ యువకుడు మరో వ్యక్తికి ఫోన్‌లో చెప్పిన సంభాషణ రికార్డింగ్ ఆడియో సోషల్ మీడియాల్లో హల్‌చల్ చేస్తోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ విషయంపై మంగళవారం మరింత స్పష్టత వచ్చే అవకాశం కన్పిస్తోంది.

అంబలి కేంద్రం ప్రారంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వద్ద రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పులిజాల రవికిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శి జాన్‌పీటర్, నాయకులు ఎంపీ ప్రవీణ్, ఎంజే రాజు, శివారెడ్డి, మహమూద్, ఎంబీ చర్చి చైర్మన్ హీరం, వైస్‌చైర్మన్ శాంసన్, సభ్యులు బీఎస్ చార్లెస్, చక్రవర్తి, వేణుగోపాల్, ప్రేమ్ పాల్గొన్నారు.

■ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని అఖిలభారత పద్మశాలి సంఘం కార్యదర్శి బాలరాజ్ ప్రారంభించారు. పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు నీలి కిషోర్, వెంకటేశ్, నరేశ్, సుకుమార్, శ్రీను, శ్రీకాంత్, బాలరాజు, కృష్ణయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

'గోపాల్‌ను స్వగ్రామానికి తీసుకువస్తాం'

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దుబాయ్‌లో చిక్కుకున్న హన్వాడ మండలం పెద్దదర్పల్లికి చెందిన గోపాల్‌ను స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం అక్కడి ఎన్ఆర్ఐ ప్రతినిధులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా దుబాయ్ ఎన్ఆర్ఐ అసోసియేషన్ అధ్యక్షుడు ఇఫ్కార్ అహ్మద్ స్పందిస్తూ.. బాధితుడిని వెంటనే సంప్రదించి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అదే విధంగా గోపాల్‌ను తిరిగి స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని జీఏడీ ప్రిన్సిపల్ కార్యదర్శి రఘునందర్‌రావును మాజీ మంత్రి కోరారు.

రంగనాయకస్వామి గుట్టకు ఎసరు?

జడ్చర్ల: బాదేపల్లి శ్రీరంగనాయకస్వామి గుట్టకు కొందరు ఎసరు పెట్టారు. గుట్ట వెనుక ప్రాంతంలో తమ పట్టా భూమి ఉందనే కారణంతో సోమవారం భారీ బండరాళ్లను యంత్రాలతో తొలగించే పనులు మొదలుపెట్టారు. దీనిపై కొందరు స్థానికులు తహసీల్దార్ నర్సింగ్‌రావుకు ఫిర్యాదు చేయడంతో.. ఆయన స్పందించి సిబ్బందిని క్షేత్రస్థాయి విచారణకు పంపారు. అయితే సదరు తొవ్వకాలు చేపట్టిన ప్రాంతం సర్వే నంబర్ 321లోకి వస్తుందని.. అది తమ పట్టా భూమి అని యజమాని రెవెన్యూ సిబ్బందికి వివరించారు. అయితే సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించే వరకు పనులు నిలిపివేయాలని రెవెన్యూ సిబ్బంది సూచించారు. ఈ మేరకు బండరాళ్ల తొలగింపు పనులను నిలిపివేశారు.

తడిసిన ధాన్యాన్ని కొంటాం

అడ్డాకుల: అకాల వర్షానికి తడిసిన వరిధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలోని అడ్డాకుల మండలం బలీదుపల్లి శివారులో వర్షానికి తడిసిన వరిధాన్యాన్ని సోమవారం రాత్రి ఆయన పరిశీలించారు. అదే విధంగా ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ చేసిన ధాన్యాన్ని ఎమ్మెల్యే పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని.. ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు.

ఉష సెమినార్‌లో ఉత్తీర్ణత

జడ్చర్ల టౌన్: హైదరాబాద్‌లోని శ్రీభవిష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉషు మార్షల్ ఆర్ట్స్ జడ్జింగ్ సెమినార్‌లో జడ్చర్లకు చెందిన మాస్టర్ తాజుద్దీన్ ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఉషు మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఉమ్ చేతులమీదుగా సర్టిఫికెట్ పొందినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాస్టర్ తాజుద్దీన్‌కు జడ్చర్ల మార్షల్ ఆర్ట్స్ కరాటే మాస్టర్లు అభినందనలు తెలియజేశారు.

క్రికెట్ బెట్టింగ్‌పై యువతకు కౌన్సెలింగ్

మహబూబ్‌నగర్ క్రైం: ఐపీఎల్ వంటి క్రికెట్ బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలని వన్‌టౌన్ ఎస్ఐ శీనయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని వీరన్నపేట ఏరియాలో సోమవారం దాదాపు 40మంది యువతకు క్రికెట్ బెట్టింగ్‌పై కౌన్సెలింగ్ నిర్వహించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశకు వెళ్లి అప్పులపాలై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తున్న క్రమంలో ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వాటిపై నిఘా పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు.

కరాటే శిక్షణ శిబిరం బ్రోచర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ క్రీడలు: శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి కరాటే శిక్షణ శిబిరం పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలో ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో మానసికంగా ఎదగవచ్చన్నారు. వేసవి కరాటే శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ మాట్లాడుతూ.. ఈ నెల 30 నుంచి జూన్ 11వ తేదీ వరకు 45 రోజుల పాటు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో కరాటే శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోటకదిర నర్సింహులు, హరి, మహేందర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

దేవరకద్ర: యోగాతో ఆరోగ్యంగా ఉండటంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని యోగా శిక్షకుడు సురేశ్ అన్నారు. సోమవారం దేవరకద్ర ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎదుగుతున్న పిల్లలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు యోగా, ధ్యానం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. పిల్లలకు పోషకాహార లోపం, ఎనీమియా వంటి విషయాలలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు అరుణమ్మ, ఎంఎన్ఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



అడ్డాకుల: మూసాపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఉమ్మడి మండల మాజీ వైస్ ఎంపీపీ నామాల మశ్చందర్‌నాథ్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్ నివాసం వద్ద ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

నవాబుపేట: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య మరింత పెంచాలని ఎంపీడీఓ జయరాం నాయక్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో దాదాపు 2వేల మందికి పైగా కూలీలు ఉపాధి హామీ పనులకు వస్తున్నారన్నారు. కూలీల సంఖ్య మరింత పెంచేందుకు గాను జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సూచించారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో తప్పనిసరిగా నీడ సౌకర్యం, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ భద్రునాయక్, ఏపీఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సమీయుల్లా తదితరులు ఉన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
మహబూబ్‌నగర్ మహ్మద్ తౌసిఫ్ అలీ - 73969 95582
కోస్గి కె. రమేష్ - 99486 98552
జడ్చర్ల పి. ఆంజనేయులు - 80966 88450

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
శ్రీశైలం - 97051 35557
వెంకటయ్య - 90108 69797